సాక్షి మంచిర్యాల

మంగళవారం, 16, మే, 2023



నేటి నుంచి దోస్త్

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులు ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. 8లో▸



భూమి కోసం పోరుబాట

రియల్టర్లు అసైన్డ్ భూములు కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని పక్షం రోజులుగా పోరాటం చేస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.0 /29.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పౌరసరఫరాల మేనేజర్‌గా వేణు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో వేణు

మంచిర్యాల టౌన్: జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా మంచిర్యాల ఆర్డీవో దాసరి వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరిధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బు సకాలంలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎంఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ పీడీ మళ్లీ బదిలీ

- కొత్త పీడీగా కేఎస్.అజయ్‌మణికుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ), పీఐయూ జీవీ భీమాసేనారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం కర్ణాటక కేడర్ 18 మంది అధికారులను మారుస్తూ ఎన్‌హెచ్‌ఏఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న రవీందర్‌రావు చెన్నయ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ రీజినల్ ఆఫీసులో డీజీఎం హోదాలో పని చేస్తున్న జీవీ.భీమాసేనారెడ్డి ఈ నెల 4న బాధ్యతలు చేపట్టారు. మళ్లీ 11 రోజులకే కర్ణాటక ఎన్నికలు పూర్తయ్యాక ఆ రాష్ట్ర పరిధిలో పీడీలకు బదిలీలు అయ్యాయి. దీంతో భీమాసేనారెడ్డి తిరిగి హైదరాబాద్ పాత స్థానానికి వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడికి పీడీగా వస్తున్న కేఎస్.అజయ్‌మణికుమార్ కాలబురగి(గుల్బార్గ)కు జనరల్ మేనేజర్ హోదాలో పని చేస్తున్నారు.

రేపే పాలిసెట్

శ్రీరాంపూర్: ఈ నెల 17న పాలిసెట్–2023 నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పీ.శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో మూడేళ్ల ఇంజినీర్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులతోపాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశం కోసం జరిగే పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,300 మంది హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నస్పూర్, మంచిర్యాల పట్టణ పరిధిలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు గంట ముందు రావాలని, ఉదయం 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని తెలిపారు. హాల్‌టికెట్‌పై ఫొటో ప్రింటు కాని వారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వడదెబ్బతో కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ సంతోష్‌కుమార్(ఫైల్)

లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణంలోని అంకతివాడకు చెందిన పోలీసు కానిస్టేబుల్ సంతోష్‌కుమార్(36) ఆదివారం రాత్రి వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌కుమార్ రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో సెలవులో ఉన్నాడు. ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వడదెబ్బ తీవ్రత ఎక్కువ కావడంతో మృతిచెందాడని తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పోలీస్ పెట్రోల్‌బంకు ఏర్పాటుకు భూమి పూజ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పోలీస్ పెట్రోల్‌బంకు ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ పర్యవేక్షణలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు గత రెండేళ్ల క్రితమే మంజూరు కాగా ఎట్టకేలకు ముందడుగు పడింది. సీఐ రాజు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ మేనేజర్ సురేష్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమోషనా.. వద్దు..!

- భూగర్భ గనుల్లో యువ కార్మికుల తీరు
- జనరల్ మజ్దూర్‌కే డిమాండ్
- తక్కువ వేతనమైనా సరేనంటూ..
- ప్రైవేటీకరణకు ఊతమిస్తున్న ఖాళీలు
- లోపభూయిష్టంగా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ విధానం



భూగర్భంలో విధులు నిర్వహిస్తున్న సపోర్టుమెన్ కార్మికులు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణి భూగర్భ గనుల్లో కొన్ని పై కేటగిరి ప్రమోషన్లు తీసుకోవడానికి యువ కార్మికులు నిరాకరిస్తున్నారు. జీతం ఎక్కువగా వచ్చే పై కేటగిరికి వెళ్లకుండా తక్కువ వేతనమైన సరేనంటూ మొదటి కేటగిరి జనరల్ మజ్దూర్‌కే మొగ్గు చూపుతున్నారు. ఆయా కేటగిరిల్లో యాక్టింగ్(పనులు) చేస్తున్నప్పటికీ శాశ్వతంగా ప్రమోషన్ లెటర్లు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ఇందుకు పైకేటగిరిల్లో శ్రమ, బాధ్యతగా పని చేయాల్సి ఉండడం కొంత కారణమైతే.. ప్రధానంగా భవిష్యత్‌లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా వెళ్లడం కోసం ప్రస్తుతం ఇచ్చే ప్రమోషన్ లెటర్లు తీసుకోవడం లేదు. కొన్ని అండర్ గ్రౌండ్ కేటగిరిల లెటర్లు తీసుకుంటున్నారు. దీంతో చాలా కేటగిరిలు ఖాళీగా ఉంటున్నాయి. ఇదిరోజుకింత ముదురుతుండడంతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. ఇటీవల కారుణ్య ఉద్యోగాల వల్ల కంపెనీ వ్యాప్తంగా సుమారు 11 వేల మంది కొత్తగా ఉద్యోగంలో చేరారు. వారిలో సగానికి పైగా మంది ఇదే వైఖరితో ఉన్నారు. దీంతో కంపెనీ వ్యాప్తంగా సుమారు 1500 ఖాళీలు ఉన్నాయి.

వేతనం తక్కువైన పర్వాలేదు

జనరల్ మజ్దూర్‌గా తక్కువ వేతనం వచ్చిన పర్వాలేదు గానీ ఎక్కువ వేతనం వచ్చే పై కేటగిరిలకు మాత్రం వెళ్లడానికి కార్మికులు ఇష్టపడడం లేదు. ఒక జనరల్ మజ్దూర్ కోల్‌కట్టర్‌గా పై కేటగిరి ప్రమోషన్ తీసుకుంటే అప్పటివరకు ఉన్న జీతం కంటే అదనంగా నెలకు కనీసం రూ.4వేల నుంచి రూ.5వేల వరకు పెరుగుతుంది. అయినా వద్దనుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. కంపెనీ నిబంధన ప్రకారం ఉద్యోగంలో చేరిన తర్వాత వారు మొదట బదిలీ వర్కర్‌గా పని చేయాలి. ఇలా ఒక ఏడాది భూగర్భంలో 190 మస్టర్లు నిండితే అతడికి అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లుగా పర్మినెంటు చేస్తూ ప్రమోషన్ లెటర్లు ఇస్తారు. బదిలీ వర్కర్ ఉన్నంత కాలం వారికి సరైన ఉద్యోగ భద్రత, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు ఉండవు. అండర్‌గ్రౌండ్‌లో జనరల్ మజ్దూర్ తర్వాత వారిని కోల్‌కట్టర్, లైన్‌మెన్, సపోర్టుమెన్(టింబర్ మెన్), ట్రామర్, హాలర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, ఫ్యాన్ ఆపరేటర్, టిండాల్, ఎలక్ట్రీషియన్ హెల్పర్, ఫిట్టర్ హెల్పర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్, సర్వే, ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లోని పలు కేటగిరిల్లో పనుల (యాక్టింగ్)కు పంపిస్తారు. ఇలా ఆయా పై కేటగిరిల్లో కొంతకాలం యాక్టింగ్ చేస్తున్న వారిని ఖాళీలను బట్టి వారు చేసిన యాక్టింగ్ మస్టర్లు, సీనియారిటీ ప్రకారం ప్యానల్ జాబితా తయారు చేసి ఆ పై కేటగిరిల్లో ప్రమోషన్లు కల్పిస్తారు. వీటిలో పంప్ ఆపరేటర్, హాలర్ ఆపరేటర్, ఫ్యాన్ ఆపరేటర్ ప్రమోషన్లు ఇష్టంగానే తీసుకుంటున్నారు. కానీ కోల్ కట్టర్, లైన్‌మెన్, సపోర్టుమెన్(టింబర్‌మెన్), ట్రామర్, ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రీషియన్ హెల్పర్, ఎస్‌డీఎల్ ఆపరేటర్ లెటర్లు తీసుకోవడం లేదు.

లెటర్ల రద్దుకు పైరవీలు..

ఐఈడీ నిబంధనల ప్రకారం ఆయా కేటగిరిలో నిర్ణీత సంఖ్యలో పర్మినెంట్ ఉద్యోగులు పనిచేయాలి. గత రెండేళ్లుగా చాలామంది కార్మికులు తమకు వచ్చిన ప్రమోషన్లు లెటర్లు తీసుకోకపోవడంతో ఆ కేటగిరీలో ఖాళీలు పెరుగుతున్నాయి. పనులకైతే వెళ్తున్నారు గానీ పర్మినెంట్‌గా ప్రమోషన్ లెటర్లు తీసుకోవడం లేదు. మూడేళ్ల ముందు తమకు వచ్చిన ప్రమోషన్లు లెటర్లు రద్దు చేసుకునే అవకాశం ఉండేది. ఇలా పెద్ద సంఖ్యలో లెటర్లు తీసుకోక ఖాళీలు పెరుగుతున్నాయనే కారణంతో గత రెండేళ్లుగా ప్రమోషన్లు వెనుక్కు తీసుకోవడం లేదంటూ కంపెనీ ఆదేశాచ్చింది. కొందరు యువ కార్మికులు ఈ ప్రమోషన్ లెటర్ల రద్దు కోసం గుర్తింపు సంఘం నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, చివరికి మంత్రుల వద్దకు వెళ్లి పైరవీలు చేయిస్తున్నారు.

శ్రీరాంపూర్‌లోనే అత్యధికం..

కంపెనీలోనే అతి పెద్ద ఏరియా శ్రీరాంపూర్‌లో ఎక్కువ భూగర్భ గనులు కూడా ఉండడంతో ఈ సమస్య అధికంగా ఉంది. నేతల రికమెండేషన్ లెటర్లు జీఎం కార్యాలయానికి పుట్టల కొద్దీ రావడంతో ఇక్కడ అధికారులు తల పట్టుకుంటున్నారు. ఇలా ప్రమోషన్లు రద్దు చేస్తూ పోతే ముందు గనులను ఎలా నిర్వహిస్తామని అధికారులు వాపోతున్నారు. రికమెండేషన్‌ను తలొగ్గి ఒకరిద్దరికి ప్రమోషన్ లెటర్లు రద్దు చేస్తే మిగతా వాళ్లంతా తమకెందుకు చేయడం లేదని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ విధానం మార్చాలి

గతంలో భూగర్భంలో పనిచేసే అన్ని కేటగిరిల వారికి, ఆరోగ్యం బాగోలేకపోయే వారు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌లో ఖాళీలు పడ్డప్పుడు దరఖాస్తు చేసుకునే వారు. ఏ కేటగిరి వారైనా హెల్త్, సీనియారిటీ, చదువు అర్హత ఆధారంగా సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు దరఖాస్తు చేసుకొనే వీలుండేది. కానీ మూడేళ్ల క్రితం కంపెనీ కేవలం అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్‌లే సర్ఫేస్ జనరల్ మజ్దూర్లుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రభావంతోనే ఈ సమస్య వచ్చింది. ఈ ప్రమోషన్ లెటర్లు తీసుకోకపోవడానికి కారణం భవిష్యత్తులో ఎప్పటికైనా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలు పడితే వెళ్లొచ్చనేది. దీంతో ఎన్నేళ్లయినా సరే అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్లుగా ఉండాలి తప్ప ఆయా కేటగిరిల్లో ప్రమోషన్ లెటర్లు తీసుకోవద్దని భీష్మించుకుంటున్నారు. తీసుకోకుంటే సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు దరఖాస్తు చేసుకోరాదు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పని సులువుగా ఉండడంతో దీనివైపై మొగ్గు చూపుతున్నారు. పాత పద్ధతిలో భూగర్భంలో ఏ కేటగిరిలో పని చేసే వారైన దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పిస్తే వారంతా అర్హులవుతారు. అప్పుడు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ కోసం అండర్ గ్రౌండ్‌లో ఏ కేటగిరిలోనైనా ప్రమోషన్లు తీసుకుంటారని కార్మిక నేతలు పేర్కొంటున్నారు. ఇలాగే పై ఆయా కేటగిరిల్లో ఖాళీలు ఉంటున్నాయనే సాకుతో ఆ పనులు కాంట్రాక్టు కార్మికులతో చేయిస్తామనే ఆలోచన యాజమాన్యం చేసే అవకాశం ఉంటుంది. గతంలో మేషన్ పనులకు కార్మికులు రాకపోవడంతో ఈ సాకుతో ఫైర్ సీల్ తదితర పనులను కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులకు అప్పగించింది. ఇలాగే ఈ కేటగిరిల్లో పరిస్థితి ఉంటే వాటిలో కూడా కాంట్రాక్ట్ కార్మికులు వచ్చే ప్రమాదం ఉందని కార్మిక సంఘం నాయకులు హెచ్చరిస్తున్నారు. కంపెనీ సర్ఫేస్ జనరల్ మజ్దూర్ భర్తీ విధానం మార్చాలని కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ సర్ఫేస్ జనరల్ మజ్దూర్ భర్తీకి అండర్‌లోని అన్ని కేటగిరిల వారు దరఖాస్తుల చేసుకునేలా అవకాశం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఓసీపీల్లో భానుడి ప్రతాపం

- 42 డిగ్రీలు నమోదు
- ఉపశమన చర్యలు చేపట్టిన కంపెనీ
- పనివేళలు మార్చాలని డిమాండ్



క్వారీలో చలువ పందిరి

శ్రీరాంపూర్: సింగరేణి ఓసీపీల్లో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. కొద్ది రోజులు భానుడి ప్రతాపం పెరగడంతో కార్మికులు ఎండ వేడికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో సోమవారం 42.2 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. భూగర్భ గనుల్లో ఎండ ప్రభావం పెద్దగా ఉండదు. ఓసీపీల్లోనే ఎండలు పెరిగితే కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డివిజన్‌లోని రెండు ఓసీపీల్లో గత రెండ్రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల్లో శనివారం 39 డిగ్రీలు, ఆదివారం 40.5 డిగ్రీలు, సోమవారం 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. బయటి ప్రాంతాలతో పోల్చితే ఒకటి రెండు డిగ్రీలు తక్కువగానే నమోదు కావడం కాస్త ఉపశమనంగా చెప్పవచ్చు. ఇంకా పెరిగితే కార్మికులు ఎండవేడికి పనిచేయడం ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంది.

ఉపశమన చర్యలు..

ప్రతీ వేసవిలో కంపెనీ ఎండ నుంచి ఉద్యోగులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా రెండు ఓసీపీల్లో క్వారీ, డంప్‌యార్డుల వద్ద చలువ పందిళ్లు, చల్లని తాగునీటి కోసం రంజన్లు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 15 నుంచి కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేస్తున్నారు. ఏసీ కండీషన్‌లో ఉన్న డంపర్లు, షవల్స్, డోజర్లను మాత్రమే నడిపిస్తూ ఏసీలు పనిచేయని వాటిని బ్రేక్‌డౌన్‌లుగా పెట్టారు.

పని వేళలు మార్చాలి..

ఓసీపీల్లో ఎండ తీవ్రత దృష్ట్యా పని వేళలు మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 వరకు ఉంటుంది. ఎండల దృష్ట్యా మొదటి షిఫ్ట్‌ను ఉదయం 5 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్‌ను 4 గంటల నుంచి 12 వరకు మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వేసవిలో ఈ పని వేళలు అమలు చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కనబర్చాలని కలెక్టర్ బాదావత్ సంతోష్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి చూపిస్తే గెలుపు, ఓటములు తెలిసి స్ఫూర్తిగా ఉంటారని అన్నారు. యువకులు చదువుతోపాటు క్రీడలపై ఇష్టం పెంచుకున్నట్లయితే ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో ఎంఏ అలీం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్‌లు సఫాట్ శంకర్, రాంటెంకి శ్రీనివాస్, కొరికొప్పుల ప్రమీలగౌడ్, తిరుపతి, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సోమగూడెంలో వాలీబాల్ క్రీడలు ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే చిన్నయ్య

యువత రాణించాలి

బెల్లంపల్లిరూరల్/నెన్నెల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం బెల్లంపల్లి, నెన్నెల జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్–2023 మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పీడీ బాబురావు పాల్గొన్నారు. నెన్నెలలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, ఆర్డీఓ శ్యామలదేవి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రజావాణికి వినతుల వెల్లువ

పాతమంచిర్యాల: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ప్రజలు కలెక్టర్ బి.సంతోష్‌కు వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. మందమర్రిని గ్రామ పంచాయతీగా గుర్తించాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నాయకులు కోరారు. ఊరుమందమర్రి, నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్‌ను కలిపి గతంలో గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని పి.భీంసేన్ విన్నవించాడు. బెల్లంపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి ఉచిత రవాణా వసతి కల్పించాలని, ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని, రక్తహీనత, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయాలని బెల్లంపల్లికి చెందిన కొలిపాక శ్రీనివాస్ కోరాడు. పోక్కూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బోయిరి మల్లక్క పింఛన్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించింది.



కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం ఇస్తున్న మందమర్రి, నార్లాపూర్, ఊరు రామకృష్ణపూర్‌వాసులు

దళితబంధు కోసం తిరుగుతున్నా..



పేదరికంలో ఉన్నాను. దళితబంధు పథకం కోసం అధికారులకు దరఖాస్తు చేసుకుంటే ఎమ్మెల్యేలను కలవాలని చెబుతున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావును కలిస్తే కలెక్టర్‌ను కలవాలని చెప్పారు. కలెక్టర్‌ను కలిసి ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లాలని చెప్పారు. అధికారుల చుట్టూ తిరుగుతున్న. దళితబంధు పథకం మంజూరు చేసి ఆదుకోవాలి.

–శనిగారపు రాజయ్య, నస్పూర్

ప్రభుత్వ భూమిని కాపాడాలి



బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్‌నగర్‌లో షాదీఖానాకు చెందిన ఎనిమిది గుంటల భూమిని, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని నకిలీ పట్టా సృష్టించి కొందరు ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడికి దిగుతున్నారు. మున్సిపాలిటీ వారిని సైతం బెదిరిస్తున్నారు. ప్రభుత్వ భూమికి పట్టా ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి రక్షించాలి.

– ఎండీ.అఫ్జల్‌బాబా, బెల్లంపల్లి

మిల్లులకు ధాన్యం తరలించాలి

పాతమంచిర్యాల: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని రైస్‌మిల్లులకు త్వరితగతిన తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. సోమవారం జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో వేణుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దండేపల్లి మండలంలోని రాధాకృష్ణ రైస్‌మిల్, కన్నెపల్లిలోని వెంకటేశ్వర పీబీఆర్ఎం రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లు యజమానులు త్వరగా దిగుమతి చేసుకోవాలని, ఇంటర్మీడియెట్ గోదాముల నుంచి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని సూచించారు. ప్రతీ రైస్‌మిల్లుకు ఒక ఆర్ఐని నియమించామని, ఎప్పటికపుడు సమాచారం సేకరించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవోవేణు

సీఎం కప్ క్రీడోత్సవాలు

- మండలాల్లో క్రీడలు ప్రారంభం
- జిల్లా స్థాయిలో 22 నుంచి 24వరకు..

మంచిర్యాలటౌన్: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తోపాటు ఏటా వేసవిలో చిన్నారులకు వివిధ క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కరోనా కారణంగా మూడేళ్లుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలనూ నిర్వహించలేదు. గతంలో చీఫ్ మినిష్టర్(సీఎం) కప్ పోటీలను ఏటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేవారు. సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం నుంచి సీఎం కప్–22023 క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల స్థాయిలో ఈ నెల 17వరకు నిర్వహిస్తారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో ఈ నెల 22 నుంచి 24వరకు పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో 28 నుంచి 31వరకు పోటీలు ఉంటాయి. మండలాల్లో క్రీడలు ప్రారంభం కాగా.. 15ఏళ్ల నుంచి 36ఏళ్లలోపు మహిళలు, పురుషులు పాల్గొనే అవకాశం ఉంది. మండల స్థాయిలో ఎంపీపీ చైర్‌పర్సన్‌గా, ఎంపీడీవో కన్వీనర్‌గా, జెడ్పీటీసీ సభ్యుడు, తహసీల్దార్, ఎంఈవో, మున్సిపల్ కమిషనర్, ఎస్సై, పీఈటీలు కమిటీ సభ్యులుగా, జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ/డీసీపీ వైస్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) కో వైస్ చైర్మన్‌గా, జిల్లా యువజనుల క్రీడల శాఖ అధికారి కన్వీనర్‌గా, సభ్యులుగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, డీఈవో, జీఎం ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. మండలస్థాయి క్రీడల పోటీలకు రూ.15 వేలు, జిల్లాస్థాయి క్రీడల పోటీలకు గాను రూ.75 వేలు మంజూరు చేస్తారు.

నిర్వహించే క్రీడలివే..

మండల స్థాయిలో ఐదు విభాగాల్లో మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, ఫుట్‌బాల్ కేవలం పురుషులకు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో 11 విభాగాల్లో మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ పోటీలు, పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో 18 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయి విజేతలకు వ్యక్తిగత క్రీడల్లో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తారు. గ్రూప్‌గా ఆడే క్రీడల్లో ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతికి రూ.75 వేలు, తృతీయ బహుమతికి రూ.50 వేలు అందిస్తారు. జిల్లాలోని క్రీడాకారులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



నెన్నెలలో సీఎం కప్ క్రీడాపోటీలు

నేడు మంచిర్యాలలో

సీఎం కప్ క్రీడలు మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 16న మధ్యాహ్నం 3 గంటలకు జెడ్పీ బాలుర పాఠశాల మైదానంలో పీడీ ఆర్.రాజయ్యను 94401 41328నంబరులో సంప్రదించాలని తెలిపారు.

‘మన ఊరు–మన బడి’ పనులు వేగవంతం చేయాలి

పాతమంచిర్యాల: మన ఊరు–మన బడి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్యతో కలిసి ఇంజినీరింగ్ అధికారులు, డీఈ, ఏఈ, మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను విద్యాసంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ప్రహరీ, వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, అదనపు తరగతి గదులు, భోజనశాల, విద్యుత్, తాగునీరు తదితర మరమ్మతులు ఈ నెలలోగా పూర్తి చేయాలని తెలిపారు. పనుల నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని, పనుల గ్రౌండింగ్ చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

క్లుప్తంగా

దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు

కాసిపేట(బెల్లంపల్లి): దాడి కేసులో బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముఖేష్ ఒకరికి ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌కు చెందిన గోపతి భూమయ్య 2017 ఫిబ్రవరి 8న ట్రాన్స్‌ఫార్మర్ విషయమై అతని తమ్ముడు గోపతి రామయ్యను డబ్బులు అడగడంతో ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. భూమయ్య ఫిర్యాదుతో రామయ్యపై కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై తాళ్ల శ్రీకాంత్ విచారణ జరిపించి నిందితుడిని అరెస్టు చేశారు. 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో సోమవారం శిక్ష ఖరారు చేశారు.

ఓసీపీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి


సమీక్షలో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల ఓసీపీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కంపెనీ డైరెక్టర్లు సూచించారు. సోమవారం కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), డీ.సత్యనారాయణ(ఈఅండ్‌ఎం) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ నుంచి ఏరియా ఇన్‌చార్జి జీఎం ఎం.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగనున్న నేపథ్యంలో వేసవిలోనే అధిక బొగ్గు తీయాలన్నారు. 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఓసీపీ పీవో పురుషోత్తం రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, చంద్రశేఖర్‌రెడ్డి, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. బాపునగర్ గ్రామానికి చెందిన గోలేటి సునీల్ కాగజ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌కు హాజరై ఇంటికి వెళ్తుండగా బైక్‌పై ఎదురుగా వచ్చిన నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన శివ బిశ్వాస్ ఢీకొనడంతో సునీల్‌కు గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి గోలేటి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు.

బాలికపై అత్యాచారానికి యత్నించిన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ విలేజ్ నెం.5లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఎదురింట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన సంజయ్ పరారయ్యాడు. ఈమేరకు బాలిక తల్లి బిషకా మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.



నేటి నుంచి దోస్త్

- డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్
- ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు
- మూడు విడతలుగా ప్రక్రియ
- జూలై 17 నుంచి తరగతులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్/బోథ్: 2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి చేపట్టే (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులకు ఇష్టమైన కళాశాల, నచ్చిన కోర్సు ఎంచుకునేందుకు వీలు కల్పించారు. ప్రవేశ ప్రక్రియ మూడు విడతలుగా జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ దోస్త్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు ప్రకటించారు. మే 16 నుంచి జూన్ 10 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు షురూ కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..
ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 137 ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో 6,470 మంది, మంచిర్యాల జిల్లాలో 4,656 మంది, నిర్మల్ జిల్లాలో 3,979 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3,973 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక్కో కళాశాలలో ఒక్కో కోర్సుకు 60 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఎం, కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈసారి రాష్ట్రంలోని 11 కళాశాలల్లో కొత్తగా బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ పేరిట నాలుగేళ్ల కోర్సు ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఏయే కళాశాలల్లో కొత్త కోర్సుకు అనుమతి ఉంటుందో దోస్త్ ప్రక్రియ ప్రారంభమైతేగానీ తెలియని పరిస్థితి.

ఇంట్లో నుంచే దరఖాస్తు
డిగ్రీలో ప్రవేశం పొందగోరే విద్యార్థి ఇంట్లో నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ అనుసంధానం చేసిన స్మార్ట్‌ఫోన్ ఉంటే దానితో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలా కుదరనిపక్షంలో తల్లిదండ్రుల ఫోన్లకు విద్యార్థి తన ఆధార్‌ను అనుసంధానించి ప్రక్రియను కొనసాగించే అవకాశం కల్పించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటే విద్యార్థి ఇంట్లో కూర్చునే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీయాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా సులువుగా రిజిస్టర్ చేసుకునే సదుపాయం కల్పించారు. వివరాలు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి సెల్‌ఫోన్‌కు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) సమాచారం వస్తుంది.

సీట్లు భర్తీ అయ్యేనా?
గతేడాది ఐదు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించినా సగానికి పైగా సీట్లు భర్తీ కానీ గడ్డు పరిస్థితి. ప్రభుత్వ కళాశాలల్లో కాస్త మెరుగ్గా ఉన్నా ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు మిగిలిపోవడం నిరాశ పరిచింది. నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో 1,920 సీట్లకుగానూ 807 సీట్లు మిగిలిపోయాయి. జిల్లాలో డిగ్రీ ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం కారణమైతే.. విద్యార్థులకు హైదరాబాద్ నగరంపై మోజు ఉండడం మరో కారణం. ఒకప్పుడు ఇంజినీరింగ్ విద్య కోసం రాష్ట్ర రాజధానిపై ఆసక్తి కనబర్చి బీటెక్ కోర్సులు అక్కడ చదవడం ప్రారంభించారు. మరోవైపు వసతితో కూడిన విద్య అమలు చేస్తుండడంతో గురుకులాల్లో కూడా డిగ్రీ ప్రవేశపెట్టడంతో కూడా కొంతమేర ప్రవేశాలు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రైవేట్‌లో 40శాతం సీట్లు కూడా భర్తీకాని పరిస్థితి ఏర్పడింది. దోస్త్ వచ్చిన తర్వాత విద్యార్థులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవడం చాలా తెలిక్తైంది. మరోవైపు అవసరానికి మించి కోర్సులు.. సీట్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్‌లో అత్యధికంగా ఇలాంటివే. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు సీట్లను పెంచుకుంటూ వచ్చారు. దీంతో సీట్లు భర్తీకాక డిగ్రీ కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. మంచిర్యాల జిల్లాలో 22 కళాశాలల్లో ఒకటి, రెండు మూసివేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తు విధానం

దోస్త్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో పదోతరగతి, ఇంటర్ మెమోలు, 1 నుంచి పదోతరగతి వరకు బోనఫైడ్, కండక్ట్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, ఆధార్ అనుసంధానం సెల్‌నంబర్, ఈ ఏడాది తీసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కళాశాలలు, కోర్సుల్లో ప్రవేశానికి నమోదు చేసుకోవడానికి మొదటి విడతలో రూ.200 చెల్లించాలి. క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, టీవ్యాలెట్ ద్వారా చెల్లించవచ్చు.

మూడు విడతలుగా...

మొదటి విడత ఈ నెల16 నుంచి జూన్ 10వరకు రిజిస్ట్రేషన్, ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 16న సీట్ల కేటాయింపు, 16నుంచి 25 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం ఉంటుంది. రెండో విడత జూన్ 16 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, వెబ్ఆప్షన్లు, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడో విడత జూలై 1నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 1నుంచి 6వరకు వెబ్ఆప్షన్ల నమోదు, 10న సీట్ల కేటాయింపు ఉంటుంది.

వరికోత మిషన్‌లో మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలంలోని రాంపూర్‌లో వరి కోస్తుండగా మిషన్‌లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాటం దేవేందర్ వరిపొలంలో సోమవారం మధ్యాహ్నం హార్వెస్టర్‌తో పంటను కోస్తుండగా మిషన్‌లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కిందకు దూకి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోనే మంటలు వచ్చినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ప్రమాదంలో హార్వేస్టర్ పైనున్న ట్రాక్టర్ భాగం పూర్తిగా కాలిపోయింది.

ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యాక్సినేషన్, కంటి వెలుగు కార్యక్రమాలు విజయవంతం చేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. గుండె వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు రమేశ్, దివ్య, ఉష, నాగమణి, రత్నమాల, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

యువకుడి హత్యకేసులో నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

మందమర్రిరూరల్(చెన్నూర్): ఇటీవల మందమర్రిలో జరిగిన సాగర్ హత్యకేసులో నిందితులు బొడ్డు బాలాజీ, నూనె వెంకటేశ్, అల్లంకుంట గణేశ్, బోగ వెంకటేశ్‌లను అరెస్టు చేసినట్లు డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్యతో కలిసి హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గతంలో దీపక్‌నగర్‌లోని వాటర్ ప్లాంట్ సమీపంలో ఉంటున్న ఒక అమ్మాయితో సాగర్ చనువుగా ఉండేవాడు. ఈ నెల 12న రాత్రి పల్సర్‌పై యువతి ఇంటికి రావడాన్ని గమనించిన బాలాజీ, వెంకటేశ్ మరో ఇద్దరికి సమాచారం అందించారు. నలుగురూ కలిసి యువతి ఇంటికి వెళ్లగా వారిని గమనించిన సాగర్ పారిపోతుండగా పట్టుకుని తీవ్రంగా కొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ప్రమాదంలో గాయపడ్డాడని చెప్పి మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వెళ్లిపోయారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. 13న మృతుని తండ్రి తారాచంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్‌రెడ్డి నలుగురు నిందితులను అరెస్టు చేసి 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. హత్య కేసు ఛేదించిన సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుల్ అజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు సంపత్, మహేష్, అనిల్‌కుమార్, రాము, సురేందర్‌ను డీసీపీ అభినందించారు.

'బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి'


నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): జాతీయ స్థాయి మహిళా రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ నాయకురాళ్లు సోమవారం షిర్కే చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు శోభ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ నేరస్తులకు బీజేపీ సర్కార్ కొమ్ము కాస్తుందన్నారు. ఎంపీపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. న్యాయం కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తే అక్రమంగా అరెస్టు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీ.రాజేందర్, శంకర్, అనిల్, అప్పారావు, తిరుమల, శారద, రాజమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

యోగా మహోత్సవం విజయవంతం చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్వోటూ జీఎం గుప్తా

రెబ్బెన(ఆసిఫాబాద్): హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామ చంద్రమిషన్, సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏరియాలో నిర్వహిస్తున్న హర్‌దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ యోగా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎస్వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా కోరారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మహోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యాన్యంపై నిపుణులతో శిక్షణ ఇప్పించి, యోగా ధ్యానం ప్రతిఒక్కరి జీవితంలో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

అవమానంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్


వినయ్(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): ఏతప్పూ చేయని తనతో ఎవరూ మాట్లాడడంలేదని, తనను హంతకుడిలా చూస్తున్నారని అవమానభారంతో ఓ యువకుడు సోమవారం గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని కొత్తమామిడిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నలిమెల వినయ్ ఆత్మహత్యాయత్నానికి ముందు విడుదల చేసిన వీడియోల్లో తన ఆవేదన వెల్లగక్కాడు. గత మార్చి 18న అదే గ్రామానికి చెందిన ఎంబడి సాయిష్మా గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు తానే కారణమని యువతి కుటుంబ సభ్యులు తనపై కేసులు పెట్టించి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి విడుదలై వచ్చిన తనతో గ్రామస్తులెవరూ మాట్లాడక పోవడం బాధకలిగించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. యువతి ఆత్మహత్యకు తాను కారణంకాదని, కావాలంటే తన ఫోన్ చాటింగ్ చూస్తే మీకే అర్థమవుతుందన్నారు. నాలుగేళ్లుగా ఆమె తనవెంట పడుతూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసిందని, తల్లిదండ్రులు వేరే సంబంధం చూసి పెళ్లి చేసుకోవాలని కొట్టడంతోనే ఆత్మహత్య చేసుకుందన్నారు. తనతో ఆమె చేసిన ఫోన్ చాటింగ్ చూసి తన మంచితనాన్ని ప్రజలకు తెలపాలని వీడియోలో వేడుకున్నాడు. కాగా వినయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఆత్మహత్యాయత్నం చేసుకున్నది నిజమే కానీ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

నన్ను క్షమించండి..
సారీ అమ్మా.. సారీ డాడీ.. సారీ చెల్లి.. సారీ బావా..నాకు జరిగిన అవమానాన్ని భరించలేక ఈ తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నాను. నన్ను క్షమించండి.. అంటూ తన కుటుంబ సభ్యులకు సంబంధించి ఓ వీడియోను విడుదల చేశాడు.

బెస్ట్ అవెలేబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: 2023–24 విద్యా సంవత్సరానికిగానూ జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో 3, 5,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 18 నుంచి జూన్ 2 సాయంత్రం 5గంటల్లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జిల్లాకు 35 సీట్లు కేటాయించడం జరిగిందని, 3వ తరగతిలో 17 సీట్లు, 5వ తరగతిలో 9 సీట్లు, 8వ తరగతిలో 9 సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే గిరిజన అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించరాదన్నారు. జూన్ 7న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత తహసీల్దార్‌చే జారీ చేయబడిన కుల, ఆదాయ, బోనఫైడ్, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడకు చెందిన గుర్లె చిన్నుబాయి(50) కొంతకాలంగా మద్యానికి బానిసైంది. సోమవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అర్జీలు సమర్పించారు. ఉట్నూర్ మండలం కొలాంగూడకు చెందిన లలిత ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు తమకు గిరి వికాసం పథకం కింద బోరుబావులు, విద్యుత్ మోటార్లను మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పుర్క బాగుబాయి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా కోసం, ఉట్నూర్ మండలం ఎంద గ్రామానికి చెందిన రాజేశ్వర్ పాల వ్యాపారానికి రుణం కోసం, వివిధ ప్రాంతాల ప్రజలు పింఛన్లు, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు కోసం దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి కుమురం బాలు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



ఎండ.. ప్రచండ

మంచిర్యాల జిల్లాలో రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది దాటిందంటేనే జనం బయటకు రావడానికి జంకుతున్నారు. అత్యవసర సమయాల్లో తలకు టోపీలు, చున్నీలను ధరించి బయటకు వస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- సాక్షి, మంచిర్యాల ఫొటోగ్రాఫర్

